ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025



పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీలో గన్నేరుపుట్టు గ్రామంలో పశుఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించామని హుకుంపేట పశు వైద్య అధికారి కె.చరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుల వైద్యంపై రైతులు అపోహలు వీడి వైద్య సేవలు చేయించుకోవాలన్నారు. రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించుకో వాలని కోరారు. జబ్బు పడిన చనిపోయిన పశువుల మాంసం తినకూడదని, పూర్తిగా ఉడికించిన మాంసం మాత్రమే తిన్నాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సి హెచ్ ప్రశాంత్ పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న పశువైద్యాధికారి

చింతపండుకు గిట్టుబాటు ధర కరువు



సంతకు చింతపండును తీసుకొచ్చిన గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: దళారుల దందా వ్యాహారంతో ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతాలకు చింతపండు తరలి పోతోంది. బెట్టు కాటాలతో దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో గిరిజన రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలోని సోమవారం అనంతగిరి, బుధవారం డమ్ముకు, కాశీపట్నం, మంగళవారం బొర్రా, గుమ్మకోట, శనివారం పిన్నకోట, గుజిరిలో వారపు సంతలు జరుగుతున్నాయి. నలుమూల గ్రామాల నుండి గిరిజనులు చింతపండును వారపు సంతల్లో విక్రయిస్తారు. విశాఖ,.విజయనగరం,.ఎస్.కోట, కొత్తవలస తదితర మైదాన ప్రాంతాలకు చెందిన దళారులు చౌక ధరలతో కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు.మొదటి రకం చింతపండు రూ 45 నుండి 50, రెండవ రకం 25 నుండి 35, అలాగే పిక్క తీసింది రూ 75 నుండి 90 వరకు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. అలాగే బెట్టు కాటాలతో మోసాలకు పాల్పడుతున్నారు. బెట్టు కాటాల్లో 50 కిలోలకు 5 నుండి పది కేజీలు, 100 కిలోలకు 15 నుండి 20 కిలోల వరకు తూకంలో తేడాలకు పాల్పడుతున్నారు. జీసీసీ గిట్టుబాటు ధర కల్పించలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాశీపట్నం జిసిసి గోదాం దాటుకుంటూ మైదాన ప్రాంతాలకు రవాణా జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

మలేరియా నియంత్రణకు ముందస్తు ప్రణాళిక

-15 నుండి మొదటి విడత పిచికారీ- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మన్యంలో మలేరియా నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం కింద మలేరియా విభాగం, వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్‌డిఏ, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జల వనరులు, గిరిజన సంక్షేమ శాఖ, మత్స్యశాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని దోమలను అరికట్టేందుకు పిచికారి పనులు సకాలంలో నిర్వర్తించాలని సూచించారు. గత ఏడాది చేపట్టిన మలేరియా నివారణ చర్యలపై ఆరా తీసారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ మరణాలు జరగకూడదన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి పెట్టి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా వ్యాప్తిని అరికట్టడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మూడు ఐటిడిఏల పరిధిలో యాంటీలార్వా ఆపరేషన్, దోమల నివారణ మందులు పిచికారీ, దోమ తెరల వినియోగం పై కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి ఆ దిశగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియాను నియంత్రించే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. దోమల మందు పిచికారీ పై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతీ ఇంటింటి లోపల బయట దోమల మందు పిచికారీ పనులు చేపట్టాలన్నారు. జ్వరాలున్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు.ఐటిడిఏ పిఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మలేరియా రిజిష్టర్లను తనిఖీ చేయాలన్నారు. దోమతెరలు జూన్ నాటికి వస్తాయని పేర్కొన్నారు. యాంటీ లార్వల్ ఆపరేషన్ పక్కాగా నిర్వహించాల్సిని బాధ్యత పంచాయతీ సిబ్బందిపైనే ఉందని సూచించారు.గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్సియల్ కళాశాలలో నీటి నిల్వలు తొలగింపు పనులు నిర్వహించాలని తెలిపారు.

జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి మాట్లాడుతూ, ఈనెల 15వ తేదీ నుండి జూన్ 15 వరకు మొదటి విడత దోమల మందు పిచికారీ పనులు ప్రారంభిస్తామన్నారు. జూలై 1వ తేదీ నుండి ఆగస్టు 31 వరకు రెండవ విడత పిచికారీ పనులు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం కీటక జనిత వ్యాధుల నివారణపై రూపొందించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పర్చువల్ గా ఐటిడి ఏ పిఓలు అభిషేక్ గౌడ్, కె.సింహాచలం, అపూర్వ భరత్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, సర్వజన ఆసుపత్రి సూపరింటెంట్ విశ్వమిత్ర, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పి.ఎస్.కుమార్, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఎల్.రజని, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రకృతి వ్యవసాయంలో... మహిళా సంఘాలు భాగస్వాములవ్వాలి

ప్రజాశక్తి-పాడేరు: ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాలు భాగస్వాములవ్వాలని, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పంటలు వేయాలని పాడేరు మండల అభివృద్ధి అధికారి ఎస్ డేవిడ్ రాజు, మండల వ్యవసాయ అధికారి సూర్యకళ సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై కన్వెర్జన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతు సాధికార సంస్థ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, వెలుగుశాఖ అధికారులతో పాటు రైతులకు దిశా నిర్దేశం చేశారు. ప్రకృతి వ్యవసాయ 9 సూత్రాలు, పీఎండీఎస్, ఎటిఎం, ఏగ్రేడ్ పంటలు వేసి నిరంతరం ఆదాయ పంటలు వేసి భూమి సారవంతం చేయాలని, 365 రోజులు నిరంతం పంటలతో భూమిని కప్పబడి ఉంచాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ఈ సేద్యం చేయడంతో కలిగే లాభాలపై వివరించారు. ఈ పంటలు పండించడంతో కలిగే ఉపయోగాలపై వివరించారు. సీనియర్ రిసోర్స్ పర్సన్ దేవుళ్ళు అనుభవాలను వివరించారు, గ్రామాలలో ప్రతి సంఘం సభ్యురాలు ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా అవగాహన కలిగించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచించారు. విత్తన గుళికల తయారీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు, వెలుగు ఏపీయం చిన్నారావు, సిసిలు పాల్గొన్నారు.



ప్రకృతి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మహిళలు

సొంత ఖర్చులతో తాగునీటి మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి-చింతపల్లి: తమ గ్రామంలో బోర్లు ఏర్పాటు చేసి మోటారు బిగించకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తాజంగి పంచాయతీ పరిధిలోని గొడుగుమామిడి గ్రామస్తులు తెలిపారు. కొంతకాలంగా బోరు కొట్టి మోటారు వేయక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు సొంత ఖర్చులతో మోటార్ని బిగించుకున్నారు.ఇది అధికారుల అలసత్వానికి నిదర్శనమని చింతపల్లి మండల తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ పాంగి రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొంతకాలంగా గ్రామస్తులు తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, గతంలో జల జీవన్ మిషన్ పథకంలో బోరు తవ్వి వదిలేయడంతో, ఆ బోరుకి మోటారు బిగించి తాగునీరు సరఫరా అందించాలని అనేకమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించుకున్నా స్పందించ లేదన్నారు. దీంతో గ్రామస్తులు తలో కొంత వేసుకొని మోటారు కొనుక్కుని బిగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో ఇంటింటికి తాగునీరు అందే విధంగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించకపోతే, గ్రామస్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.



నీటిని పట్టుకుంటున్న మహిళలు

పాడేరులో విభిన్న వాతావరణం

ఉదయం 8 గంటల వరకూ మంచు, ఆపై ఎండలు..

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కురుస్తుండగా మధ్యాహ్నం వేళల్లో ఎండ ఠారెత్తిస్తోంది. ఉదయం మంచు దుప్పటి కప్పేస్తోంది. ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఓ మోస్తారుగా చలి కూడా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు, సామాన్యులు సైతం తెల్లవారుజామున వాకింగ్ చేయలేని పరిస్థితి. ఉదయం 9 గంటల తర్వాత మాత్రం సీన్ మారుతోంది. మెల్లగా పొగ మంచు తొలగిపోగా.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు.



మంచులో వస్తున్న బస్



ఎండతో నిర్మానుష్యంగా ఉన్న అంబేద్కర్ సెంటర్

జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని జీడి మామిడి రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలం పందిరిమామిడి సెంటర్లో వందన్ వికాస కేంద్రాం ద్వారా ఏర్పాటు చేసిన జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలంతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ ఏజెన్సీలోని జీడి మామిడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వందన్ వికాస కేంద్రాలు ఏర్పాటు చేసి జీడి పిక్కల కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వందన్ వికాస కేంద్రాలను అభివృద్ధి చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. జీడి పిక్కల కొనుగోలు ద్వారా వచ్చే ఆదాయం వందన్ వికాస కేంద్రాల సభ్యులకు సమానంగా పంచడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు జీడి పిక్కలను వందన్ వికాస కేంద్రాలలో అమ్మే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఒక్క కేజీ జీడి పిక్కలు రూ.150 చొప్పున రైతుల నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రంపచోడవరం కేంద్రంలో జీడి పిక్కల ప్రాసెస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు.

ఐటీడీఏ ప్రాజెక్ట అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ పరిధిలో 114 వందన్ వికాస కేంద్రాలు, 14 జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం 100 మెట్రిక్ టన్నుల జీడి మామిడి పిక్కలు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ అనంతరం మార్కెట్ పంపడం జరుగుతుందని తెలిపారు. అలాగే 10 మెట్రిక్ టన్నుల చింతపండు, 20 మెట్రిక్ పసుపు, లక్ష కొండ చీపుర్లు కొనుగోలు చేసి మార్కెటింగ్ పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. విడివికెలను అభివృద్ధి చేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిడి దేగలయ్య, డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఎపీఎం రాము కామేశ్వర స్వామి, యాంకర్ పర్సన్ రామరాజు, వీడివీకెల సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, చిత్రంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తదితరులు

గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించి, గిరిజన ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రేపాక గ్రామంలోని సిపిఎం మండల కార్యవర్గ సమావేశం పాయం సీతారామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యువతీ యువకులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు అరకు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిఒ 3పై అవసరమైతే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేసి వేస్తామని, ప్రత్యేక డీఎస్సీ తీసి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను మర్చిపోయారని విమర్శించారు. ఏజెన్సీలో పట్టాదారు పాస్ పుస్తకాలను రైతుల పేరు మీద 1బిలో చేర్చకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పిఎం కిసాన్, రైతు భరోసా, వ్యవసాయ సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ముంపులో ఉన్న కూనవరం మండలంలోని 9 ప్రాధాన్యత గ్రామాల్లో కూనవరం, టేకులబోరు ఈ రెండు గ్రామాలలోని 3 వేలకు పైగా ఇళ్ల స్ట్రక్చర్ వేల్యూకు నోచుకోలేదని పేర్కొన్నారు. ఈ 9 ప్రాధాన్యత గ్రామాలను ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామంలోనూ ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మడకం నాగమణి, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య

రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలంలో రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జీకె.వీధి తహశీల్దారు రామకృష్ణ అన్నారు. జికె.వీధి మండలం రింతాడలో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తహశీల్దారు స్వయంగా ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోగా రేషన్ లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని, లేకపోతే బియ్యం నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది వీఆర్వోలు ఇంటింటికి వెళ్లి ఈకేవైసీ చేస్తున్నారని, వారి సేవలను సద్వినియం చేసుకోవాలని కోరారు. రేషన్ డీలర్లు, మీసేవా, ఆధార్ కేంద్రాల్లోనూ ఈకేవైసీ నమోదు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ఒకటి నుంచి ఐదు తరగతిలోపు పిల్లలకు సంబంధించి ఎక్కువ శాతం పెండింగ్లో ఉందని, వారికి ఆధార్ కేంద్రాల్లో అప్డేట్ చేస్తే సరిపోతుందని తెలిపారు. ఎండియు, విఆర్వో, సచివాలయం వద్ద ఈ కేవైసీ చేయించుకునేటప్పుడు ఈ-పాస్ యంత్రాల్లో ఆకుపచ్చ రంగు సూచిస్తే ఈ కేవైసీ అయినట్టు అని గులాబీ రంగులో చూపిస్తే ఈ కేవైసీ కాలేదని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సురకత్తి కృష్ణారావు, ఏండియు కంకిపాడు నారాయణ, రేషన్ డీలర్ కగుపతి పాల్గొన్నారు.



బాలుడి ఈకేవైసీ చేయిస్తున్న జికె.వీధి తహశీల్దారు రామకృష్ణ

ప్లాస్టిక్ వాడితే భయంకర రోగాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

ప్లాస్టిక్ వాడటం వల్ల క్యాన్సరు తదితర భయంకర రోగాలు దరిచేరే అవకాశం ఉందని కొయ్యూరు వీఆర్వో సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజబాబు అన్నారు. మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్‌ని నిషేధంపై అవగాహన కల్పించారు. నిషేధించిన ప్లాస్టిక్ వాడవద్దని, ప్లాస్టిక్ కవర్లలో సామాన్లు వేసి ఇవ్వద్దని, ఇకపై వాడితే దుకాణ యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. హొటల్లోనూ వేడి వేడి పదార్థాలు ప్లాస్టిక్ కవర్లో వేయడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారన్నారు. ప్లాస్టిక్‌ను జీవితంలో భాగం చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కలిసికట్టుగా అందరూ ప్లాస్టిక్‌ని నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లు చూపిస్తున్న సచివాలయ అధికారులు

ప్రజా దర్బార్‌లో సమస్యలపై అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఎటపాక, విఆర్.పురం, దేవీపట్నం, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి మండలాల నుంచి ప్రజలు ప్రజా దర్బార్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. రంపచోడవరం గ్రామంలో ముఠాదారి వీధిలో సిసి రోడ్డు మంజూరుకు, అడ్డతీగల మండలం చాపరాయి గ్రామానికి నూతనంగా కరెంటు స్థంబాలు, ఎటపాక మండలం కృష్ణవరంలో కల్వర్టు, పూడిక తీత, అంగన్వాడీ కేంద్రం నిర్మాణం వంటి సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, క్లస్టర్ ఇన్చార్జి కారం సింహాచలం, యూనిట్ ఇంచార్జి సిద్ధా వెంకన్న, ప్రసాద్, మాజీ చర్పంచ్ వై.నిరంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి అప్పలరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల పరిషత్ అధ్యక్షునిగా లొండి అప్పలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాడేరు టిడిపి ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, మండలంలో సేవ మిత్రాలను వేగంగా నియమించాలని సూచించారు. మాజీ మంత్రి మణి కుమారి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకం అని అన్నారు. బహుశా రాబోయే ఎన్నికలు మూడంచెల విధానం లో జరగ వచ్చన్నారు. మండలంలో టిడిపి కు ప్రత్యేక స్థానం ఉందని ఆ స్థానాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ సభ్యులు కీళ్ల రమేష్ నాయుడు మాట్లాడుతూ, అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ఎంపిపి అభివృద్ధి చెయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకర్ సభ్యుడు కూడా కృష్ణారావు, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సోమేలి చిట్టి బాబు, జి.మాడుగుల ఎంపిటిసి సి 2 ఈశ్వరరావు, బొర్రా విజయ రాణి, కృష్ణ మూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు వంతల కొండలరావు, కార్యదర్శి కేముడు కల్యాణం, నాయకులు నాగబ్బాయి, మత్స్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఎంపీడీవో ఏవిఏ. కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ అప్డేట్, ఫోన్ నెంబర్ అనుసంధానం వంటి అన్ని రకాల సేవలు అందించనున్నట్లు లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కెజిబివి విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక కెజీబీవి విద్యాలయం విద్యార్థి వన్నెపూరి మంజు ప్రియ తంగ్ టా మార్షల్ ఆర్ట్స్ లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విద్యార్థి 8వ తరగతి చదువుతుంది.ఈ సందర్భంగా బుధవారం మంజు ప్రియ ని ప్రిన్సిపల్ ఎన్.అనిత, సిబ్బంది సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్ అనిత మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడారంగంలో విద్యార్థులు రాణించాలన్నారు. రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏడవ తేదీన మణిపూర్లో జాతీయస్థాయి పోటీల్లో తమ విద్యార్థి పాల్గొంటుందని ఆమె తెలిపారు. మరిన్ని పతకాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఇటి బి కమలాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన డిఐఒ

ప్రజాశక్తి-పాడేరు : మండలంలోని మారుమూల ప్రాంతమైన ఈదులుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఐఓ డాక్టర్ ఎం కిరణ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పలు రికార్డులను, ఆస్పత్రి పరిధిలో గర్భిణీల వివరాల నమోదు, ఓపి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సబ్ సెంటర్‌లో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలింతలకు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.


చిన్నారిని తనిఖీ చేస్తున్న డిఐఒ కిరణ్‌కుమార్

రహదారి పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మారుమూల గిరిజన గ్రామాలకు ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో మంజూరు చేసిన రహదారుల నిర్మాణాలు మూడు నెలలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మొబైల్ టవర్లు, రహదారుల నిర్మాణాలపై బుధవారం ఆయన కార్యాలయం నుండి అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, పిఐయు ఇంజనీరింగ్ అధికారులు, బి ఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రహదారుల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంచాయతీరాజ్, పిఐయు, గిరిజన సంక్షేమ శాఖలకు రోడ్డు నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు పరిశీలించి చేపట్టాలన్నారు. పి.యం జన్ మన్ పథకంలో చింతపల్లి విభాగానికి 23 రహదారుల నిర్మాణాల ప్రతిపాదనలు చేయగా 20 రోడ్లను ఆమోదించడం జరిగిందన్నారు. మిగిలిన మూడు రోడ్లు పరిశీలించి ఆమోదించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ పాడేరు డివిజన్ పరిధిలో 7 రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించగా 5 పనులను ఆమోదించడం జరిగిందన్నారు. మిగిలిన రెండు పరిశీలించి త్వరితగతిన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు.మొబైల్ టవర్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లాలో 1600 మొబైల్ టవర్లు మంజూరు చేసామన్నారు. ఎక్కడ రేడియేషన్ ఎక్కువగా ఉంటుందో గుర్తించి ఎక్కువ గ్రామాలకు నెట్ వర్కు సౌకర్యం ఉండేలా సెల్ టవర్లు నిర్మించాలని సూచించారు. రహదారుల సమస్యలను డివిజన్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 43 జియో సెల్ టవర్ల నిర్మాణానికి స్థలాలు అనుకూలంగా లేవని జియో అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. సెల్ టవర్ల నిర్మాణానికి అనువుగా ఉండే ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ . ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పాడేరు డిఎఫ్ఓ పి.వి. సందీప్ రెడ్డి, రంపచోడవరం పి.ఓ కె. సింహాచలం, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు కె.వేణుగోపాల్, జి.డేవిడ్. పంచాయితీ రాజ్ ఎస్ ఇ శ్రీనివాస్, ఇఇ టి.కొండయ్య పడాల్, అటవీ శాఖ అధికారులు జియో, ఎయిర్ టెల్, బి ఎస్ ఎన్ ఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి తొట్టెల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

చింతపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని అంతర్ల గ్రామంలో శంకుస్థాపన చేశారు. స్థానిక ఎంపీడీవో యు వి ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఉపాధి హామీ పథకం ఏపీవో పూడి రాజు, పశుసంవర్ధక శాఖ ఏడిఆర్ డాక్టర్ చంద్రశేఖర్ లతో కలిసి పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా మండలంలో 12 పశువుల నీటి తొట్టెలు మంజూరయ్యాయని, వాటిని ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఒక్కో యూనిట్ కు రూ.40 వేలు ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు ధారలక్ష్మి, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారిణి సిహెచ్ శాలిని, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ టి మధుసూదనరావు, టెక్నికల్ అసిస్టెంట్ కె విశ్వనాధ్, ఫీల్డ్ అసిస్టెంట్ పి పల్లవి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని కిండ్ర, లబ్బర్తి, లాగరాయి, శరభవరం గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పలువురు సర్పంచ్‌లు, పీసా కమిటీ సభ్యులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రభుత్వం నిర్మిస్తున్న నీటి తొట్టెలు పశువులకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కింద్ర, లబ్బర్తి, లాగరాయి పంచాయతీల సర్పంచ్‌లు బూసరి సత్యనారాయణ, మిరియాల ఘనలక్ష్మి, మిరియాల సత్యవతి, ఏపీవో రెడ్డి బాబు, సచివాలయ సిబ్బంది, పీసా కమిటీల మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు తాము సూరిబాబు, జి.నాగరాజు, కూటమి నాయకులు దేవగిరి వెంకటరమణ, శెట్టి సుబ్బారావు, ఈక ఆదినారాయణ, సూరిశెట్టి సురేష్, వాడపల్లి గంగరాజు, గ్రామస్తులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మినీ బాలోత్సవం పోస్టర్‌ను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశం సందర్భంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌తో సంయుక్తంగా ఈ నెల 24వ తేదీన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆసరా ప్రెసిడెంట్ సి.సునీత తెలిపారు. ఆసరా గడచిన మూడేళ్లుగా విసిసి ద్వారా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లు, క్లబ్ విద్యార్థులకు అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసరా వార్షిక సమావేశం సందర్భంగా బాలోత్సం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విసిసి జిల్లా కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ సబ్ జూనియర్స్ ఎల్‌కెజి నుంచి రెండవ తరగతి, జూనియర్స్ 3 నుంచి 5వ తరగతి, సీనియర్స్ 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చిత్ర లేఖనం, కథ చెప్పటం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాసరచన, క్విజ్ వివిధ కేటగిరీలలో పోటీలు జరుగుతాయని వివరించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్, విజేతలకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసరా కమిటీ సభ్యులు శ్రీనాద్, విసిసి కో-ఆర్డినేటరు సతీష్, ఆర్గనైజర్లు కల్యాణి, భవాని, మణి, రమాదేవి, అనూరాధ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


గాయపడిన భార్యాభర్తలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యకు మెరుగైన వైద్యం నిమిత్తం ఎస్.కోట ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా టైడా ఘాట్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. క్షతగాత్రురాలిని ఆసుపత్రి ఆంబులెన్స్ లో మెరుగైన వైద్యం నిమిత్తం తరలించడంలో స్థానిక ఎంపీపీ శెట్టి .నీలవేణి, ఎస్సై. శ్రీనివాస్ సహాయ పడ్డారు. అరకువేల్లి మండలం పద్మాపురం పంచాయతీ దుమ్మగూడ గ్రామానికి చెందిన. సోమ్మెల . రొయలను మెరుగైన వైద్యం నిమిత్తం భర్త సోమ్మెల రంగరావు, కుటుంబ సభ్యులు బుధవారం ఆటోలో తరలిస్తున్నారు. డమ్ముకు టైడా మార్గమధ్య ఘాట్ రోడ్డు వద్ద ఆటో కొండను ఢీ కొంది. దీంతో సోమేల రంగారావు, మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటన స్థలంలో స్థానిక వైద్య అధికారిణి జ్ఞానేశ్వరి ప్రథమ చికిత్స నిర్వహించారు అనంతరం వైద్యం కోసం తరలించారు.

వాహనాలకు అంతరాయం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలోని బుధవారం జరిగే వారపు సంత రోజున వాహనాలు రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం చింతపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న దుకాణాల వద్దకు సందర్శించి దుకాణ యజమానులతో చర్చించి నాబార్డు ఆధ్వర్యంలో నిర్వహించిన వారపు సంత షెడ్లలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకుని క్రయవిక్రయాలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి బుధవారం ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు దుకాణ యజమానులు సహాయ సహకారాలు అందించాలని ఆయన అన్నారు. పంచాయతీ అధికారులు, పోలీస్ శాఖ సూచనలను వ్యాపారస్తులు ఉల్లంఘించి ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలతోనే ఉద్యోగాలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా ఆదివాసి నిరుద్యోగులకు మహిళా శిశు సంక్షేమ సాధికారత పరిధిలోని వన్ స్టాఫ్ సెంటర్, మిషన్ వాత్సల్యలో పోస్టులు కేటాయించకపోవడం దారుణమని, కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎపి గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పాడేరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నోటిఫికేషన్ లో ఆదివాసీలకు ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం సరికాదని, అధికారులు పున్న పరిశీలన చేసి గిరిజనేతరులతో భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ రద్దుచేసి పోస్టుల భర్తీలో ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ సాధికారత కార్యాలయం జారీ చేసిన నోటిఫికేషన్‌తో ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి నిరుద్యోగులకు అన్యాయం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అగ్నికి కొండలు ఆహుతి


దగ్ధమౌతున్న కొండలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మన్యంలో అగ్నికి కొండలు ఆహుతవుతున్నాయి. భానుడు ప్రతాపానికి కొండలు ఎండిపోగా, అడవికి వెళ్లే ధూమపాన ప్రియులు కాల్చి పడేసిన సిగరెట్, చుట్టల పీకలతో మంటలు చెలరేగి కొండలు కాలిపోతున్నాయి. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయితీ కొత్త వీధి సమీపంలో పెద్ద కొండ మీద బుధవారం మంటలు వ్యాపించాయి. ఈ కొండకు ఆనుకొని దొడ్డవరం, రాజేంద్రపాలెం గ్రామాల రైతులకు చెందిన జీడి మామిడి తోటలు కాలిపోతాయని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలన గిరిజన రైతులు కోరుతున్నారు.

చెత్త బుట్టల పంపిణీ


ప్రజలకు డస్ట్ బిన్‌ల పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండ గ్రామంలో సర్పంచ్ కుంజేటి రామకృష్ణ బుధవారం ప్రజలకు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి డస్ట్ బిన్‌లో ఉంచితే చెత్త సేకరణకు వచ్చిన క్లాప్ మిత్ర సిబ్బంది దూర ప్రాంతానికి తరలిస్తారని తెలిపారు.

ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ నాగలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ పాత్రుడు, వార్డు సభ్యులు గెమ్మెల మోహన్, వైసిపి నాయకులు వంతల చంటిబాబు, గ్రామస్తులు రాజుకుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యరూపం దాల్చని సూపర్ సిక్స్

ప్రజాశక్తి-కొయ్యూరు : రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎటువంటి కార్యరూపం దాల్చలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ విమర్శించారు.

ఈ మేరకు కొయ్యూరులో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనను ప్రశ్నించే విధంగా ప్రజలతో ప్రజా ఉద్యమాలు చేపట్టే దిశగా నిర్ణయాలు చేసేందుకు ఈ నెల 4న చింతపల్లిలో సీపీఐ జిల్లా సమితి సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి వస్తున్నారని, జిల్లాలోని అన్నీ మండలాల పార్టీ సమితి కార్యవర్గ సభ్యులు, ముఖ్య ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

లాజిస్టిక్ రంగంలో అపార ఉద్యోగావకాశాలు

గీతం సదస్సులో నిపుణుల వెల్లడి


సదస్సులో పాల్గొన్న నిపుణులతో గీత ం ప్రతినిధులు, విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : లాజిస్టిక్స్, ఆపరేషన్ రంగంలో అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని అవాన్ ఇంటలెక్ట్ సంస్థ అధ్యక్షుడు డేవిడ్‌సింగ్, ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ఇండియా) బబ్లు తివారి, ప్రొఫెసర్ కార్తికేయన్ అన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్, ఆపరేషన్ అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు అధ్యక్షత వహించిన సదస్సులో నిపుణులు మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా, కాలానుగుణంగా నైపుణ్యాలను విస్తృత పరుచుకోవాలని సూచించారు .గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ, పరిశ్రమలకు విద్యాసంస్థలకు మధ్య బలమైన సంబంధాల ద్వారా దేశానికి అవసరమైన మానవ వనరులను నైపుణ్యాలతో సిద్ధం చేయవచ్చునని అభిప్రాయపడ్డారు విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు నిపుణులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్ సాయి సుధాకర్, ఆపరేషన్, సప్లై విభాగం చైర్మన్ డాక్టర్ వైఎల్‌పి.తరణి పాల్గొన్నారు.


ప్రభాస సాహిత్యం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రభాస భారతి రచయితల సాహితీ సృజనలపై రచయిత రమేష్ ప్రసాద్ రావెళ్ల చేసిన విమర్శాత్మక రచనలు చాలా అద్భుతంగా ఉన్నాయని విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ రఘురామారావు కొనియాడారు. బుధవారం విశాఖ సంస్కృతి మాసపత్రిక ఆధ్వర్యంలో సన్యాసిరావు అధ్యక్షతన, డాక్టర్ రమేష్ ప్రసాద్ రచించిన ప్రభాస సాహిత్యం పుస్తకావిష్కరణ సభ ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ ఈ పుస్తకం చదివితే ప్రపంచంలోని విభిన్న వర్గాల ప్రజలు జీవనశైలి ఆలోచన ధోరణులు అవగతమౌతాయన్నారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ రచయిత రమేష్ ప్రసాద్‌కు కంప్యూటర్ సైన్స్ ఫిజిక్స్ అంశాల్లో ఎంత అనుభవం ఉందో సాహిత్యంలో కూడా అంతటి గొప్ప ప్రావీణ్యం ఉందని కొనియాడారు. పుస్తక రచయిత రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్య విమర్శ చేయడం అంత సులువైన పని కాదన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మెరుగైన వైద్యసేవలు అందించండి


యుపిహెచ్‌సి సందర్శనలో డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా వైద్యసేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం రంగరాజువీధి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సిడి 3.0, అభ ఐడి జనరేషన్ వంటి ఆరోగ్య కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్థానిక వైద్యులు, సిబ్బందితో యుపిహెచ్‌సిలో సేవలపై సమీక్షించారు. ఇన్, అవుట్ పేషెంట్లు, వ్యాధినిర్ధారణ పరీక్షలు, ఆసుపత్రి ప్రసవాలు, ఎన్‌సిడిసిడి.సర్వే, ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్స్, కెపిఐ ఇండికేటర్స్‌పై వైద్యాధికారులకు సూచనలు చేసారు. గర్భిణులు, చిన్నపిల్లలు, ఇతరత్రా వ్యాక్సినేషన్ క్రమబద్ధంగా జరగాలని సూచించారు. ఆశా కార్యకర్తల విధులను పర్యవేక్షించి, గర్భిణులకు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలతోపాటు, పౌష్టికాహారం సరిగా తీసుకునేలా సూచనలు చేయాలన్నారు.కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్ హామీని అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- గాజువాక : ఉపాధ్యాయులకు తక్షణమే డిఎ చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గాజువాక సిఐటియు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 29శాతం ఇంటిరియం రిలీఫ్ (ఐఆర్) ఇవ్వాలని కోరారు. ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా విద్యార్థుల నమోదు పెంచేందుకు యుటిఎఫ్ నేతలు, కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు టి. అప్పారావు, మహ్మద్ రిజ్వాన్, ఎం. రవిబాబు, పెద గంట్యాడ ప్రధాన కార్యదర్శి సూరిబాబు, గాజువాక అధ్యక్షులు ఎస్‌వి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు, ఎన్. శ్రీనివాస్ రాజు, డి.నూకరాజు, ఎ. రవిబాబు, ఎస్.అపరంది, ఎ. విజయకుమారి, బి. సువర్ణలత, ఎం. అనితకుమారి, కె.మహిమరావు స్థానిక సిఐటియు నేతలు ఎం.రాంబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌విక.పరశరాం పాల్గొన్నారు.

మెడికల్ టెక్నీషియన్ల ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఆవిర్భావ దినోత్సవం ఈఎంటి సిబ్బంది బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రహదారి సక్రంగా లేని గ్రామాల్లో ఫీడర్ అంబులెన్స్ ద్వారా రోగులకు సకాలంలో విశేష సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు


అక్కవరంపేట సచివాలయం తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-సీలేరు : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. జీకే వీధి మండలం పెదవలస, దేవరాపల్లి సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం లక్కవరపేట సచివాలయాన్ని చేరుకొని రికార్డులు పరిశీలించారు. లక్కవరపేట సచివాలయంలో సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని కార్యదర్శి, యానిమల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ఆబ్సెంట్ వేశారు. సచివాలయ పరిధిలో సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాలను సందర్శించి సిబ్బంది విధులకు హాజరయ్యారా లేదా అని స్వయంగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఇఓపిఆర్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పి4 సేవలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి- మాధవధార : పి4 సేవలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయ్యాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పి4 కార్యక్రమంలోని ముఖ్యాంశాలు కేంద్ర ప్రభుత్వలక్ష్యాలలోనివేనన్నారు. దేశంలో టాప్ 500 కంపెనీలు కోటి మంది పేదలకు ఉపాధి చూపాలని ప్రధాని మోడీ ఆయా కంపెనీ యాజమాన్యాలకు నిర్ధేశించడంతో ఆ కార్యక్రమం కేంద్ర స్థాయిలో ఇప్పటికే కొనసాగుతుందని వెల్లడించారు. దాతృత్వంతో సమాజం మారదని, పేదరికం తగ్గాలంటే పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాల్సి ఉందన్నారు. ఇటీవల గ్రామాల్లో చేపట్టిన నైపుణ్య సర్వేలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా రంగాలలో వారిని ప్రోత్సహించాలని కోరారు. పి 4 సర్వేలో అందరి సలహాలు సూచనలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతించారు.

శ్రీరామనవమి రాట మహోత్సవం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగుబయలు గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని బుధవారం అర్చకులు కొర్ర రాము ఆధ్వర్యంలో ముహూర్తపు రాట వేశారు. ఈనెల 6న రామాలయ ప్రాంగణంలో నవమి వేడుకలు సందర్భంగా వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమం లో గొర్ల గణేశ్వరరావు, నడిగట్ల నాగభూషణం, బురిడీ సరస్వతిరావు తదితరులు పాల్గొన్నారు.


రాట ఉత్సవంలో ఏనుగుబయలు గ్రామస్తులు